క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం, రత్నవరం గ్రామాలకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కె.సైదయ్య ఆదివారం తెలిపారు. సిరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వల్లాపురం 11కేవీ, నడిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని రత్నవరం 11కేవీ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్నట్లు ఆయన తెలిపారు. అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా దేవరం అనిత



అనితారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న సునీతరావు, అనురాధ

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన దేవరం అనితారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని గాంధీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, జిల్లా అధ్యక్షురాలు అనురాధ ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడారు. తన నియామకాన్ని సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, జాతీయ అధ్యక్షురాలు అలక లాంబ, రాష్ట్ర, జిల్లా అధ్యక్షురాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



ఆలయంలో ద్రవిడ వేదపారాయణం చేస్తున్న పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్రవిడ వేదపారాయణం, పల్లకీసేవ తదుపరి మంత్రపుష్ప నీరాజనం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా వీరమల్ల రమేష్



గరిడేపల్లి : మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప దేవాలయం కమిటీ చైర్మన్‌గా, శాశ్వత గురుస్వామిగా వీరమల్ల రమేష్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరమల్ల రమేష్ గురుస్వామి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో గుంటూరు రాము, బొంత సైదిరెడ్డి, ఎడవెల్లి వెంకటరెడ్డి, ఓరుగంటి వీరస్వామి, యడవెల్లి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, సైదిరెడ్డి పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మండల నూతన కార్యవర్గం

నడిగూడెం : మండల కేంద్రంలో ఆదివారం మాల మహానాడు సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొమ్ము రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాసరి నరేష్, ఉపాధ్యక్షుడిగా కామళ్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బూరుగడ్డ థామస్, సహాయ కార్యదర్శిగా కళతిపిరి గురుస్వామి, కోశాధికారిగా కొమ్ము మహేష్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలుగా నోసిన లావణ్య, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు గుజ్జ అంజి, పసుపులేటి మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో కార్మికులు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య జవానులు, సిబ్బంది తదితరులున్నారు.

పగలు వెలుగులు.. రాత్రి చీకట్లు

- అస్తవ్యస్తంగా వీధిదీపాల నిర్వహణ
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నయానగర్‌లోని ఓ వీధిలో రాత్రి సమయంలో వెలగని వీధిలైటు



బ్రిలియంట్ స్కూల్ బజార్‌లో పగలే వెలుగుతున్న వీధిలైటు

కోదాడ : కోదాడ మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పగలంతా వీధి దీపాలు వెలుగుతూ రాత్రి కాగానే ఆరిపోతూ నిర్వహణ అయోమయంగా మారింది. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా మున్సిపాలిటీలో పట్టించుకనేవారు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు శాఖల మధ్య సమన్వయ లోపంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

ఫిర్యాదు చేసినా స్పందన కరువు..

మున్సిపాలిటీ పరిధిలో వీధి లైట్ల నిర్వాహణ బాధ్యతను గత అక్టోబర్ వరకు ఓ ప్రైవేట్ సంస్థ నిర్వాహించేది. వీధి దీపాలు మరమ్మతులకు గురైతే వారే కొత్తవాటిని అమర్చడంతో పాటు పట్టణంలో మొత్తం వీధి లైట్ల నిర్వాహణ చూడాల్సివుంటుంది. వారికి లక్షల్లో బిల్లు చెల్లిస్తున్నా నిర్వాహణ సక్రమంగా లేదని బిల్లులు చెల్లించడం నిలిపివేశారు. ఇదే సమయంలో వారి కాంట్రాక్టు కాలపరిమితి కూడా తీరిపోవడంతో ప్రస్తుతం మున్సిపాలిటీ సిబ్బందే వాటి నిర్వాహణ చూస్తున్నారు. కొంత కాలంగా మున్సిపల్ అధికారులు నిధులు లేవని కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయడం మానేశారు. దీంతో పట్టణంలో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రధాన రహదారిపై అదే పరిస్థితి..

మున్సిపాలిటీ పరిధిలోని వీధులతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారులపై కూడా వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. సూర్యాపేట రోడ్డులోని రాంమ్మూర్తినగర్ నుంచి అల్వాలపురం క్రాస్‌రోడ్డు వరకు, తమ్మర వాగు నుంచి మినిబైపాస్ వరకు, రంగా థియేటర్ నుంచి హుజూర్‌నగర్ రోడ్‌లోని బైపాస్ వరకు వీధి దీపాలు వెలగడం లేదని, దీనిపై ఫిర్యాదు చేసినా మున్సిలిటీ అధికారులు నెలల తరబడి కనీసం స్పందించడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో దొంగతనాలు పెరుగుతున్నందున్న అధికారులు స్పందించి కాలనీల్లో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రైస్‌మిల్లుల హమాలీల కూలి రేట్లు పెంచాలి



చర్చల్లో పాల్గొన్న లోకల్ మిల్లర్లు, హమాలీ మేస్త్రీ యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : లోకల్ రైస్‌మిల్లుల యజమానులు హమాలీల కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ముత్తినేని కోటయ్య మిల్లులో లోకల్ రైస్‌మిల్లుల యజమాన్యం, హమాలీ మేస్త్రీ యూనియన్ నాయకులతో నూతన ఒప్పంద చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఒప్పంద కాల పరిమితి డిసెంబర్ 31తో ముగియడంతో తిరిగి నూతన ఒప్పందం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా నూతన కూలీ రేట్లు పెంచాలని ఆయన కోరారు. కాగా ఇరువర్గాల వారు ఏకభిప్రాయానికి రాకపోవడంతో చర్చలు వాయిదా వేశారు. సమావేశంలో మిల్లర్లు ముత్తినేని వెంకటేశ్వరరావు, పునుగుపాటి వెంకటేశ్వరరావు, చిన్నం సురేష్, భోగాల శ్రీనివాస్‌రెడ్డి, నోముల సీతారామయ్య, విశ్వనాథం, శ్రీనివాస్, సత్యనారాయణ, మాధవరావు, రంగయ్య, మేస్త్రీలు లింగం ధనమూర్తి, నక్క వెంకటేశ్వర్లు, దారా వీరస్వామి, వెంకటనారాయణ, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

‘ఓ నాన్న కన్నీటి గాథ’ టెలీఫిల్మ్ విడుదల



టెలీఫిల్మ్‌ను విడుదల చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణ

హుజూర్‌నగర్ : ఆది క్రియేషన్స్ ఆధ్వర్యంలో, మామిడి హరికృష్ణ సహకారంతో పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం నందిగామ రత్నకుమార్ రచించి దర్శకత్వం వహించిన ‘ఓ నాన్న కన్నీటి గాథ’ టెలీఫిల్మ్ (చిన్నచిత్రం)ను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణ శనివారం రాత్రి హైదరాబాదులోని రవీంద్ర భారతిలో విడుదల చేశారు. అనంతరం చిత్ర యూనిట్‌ను ఆయన అభినందించారు. మండలంలోని అంజలిపురం మాజీ సర్పంచ్ దొండపాటి ఆదిరెడ్డి నిర్మించి, ప్రధాన భూమికను పోషించారు. మానవత్వాన్ని మరిచి తల్లిదండ్రులను విస్మరిస్తున్న ప్రస్తుత రోజులను గుర్తు చేస్తూ నిర్మించిన ఈ చిత్రంలో పూర్ణ, రమణారెడ్డి, ఆలీ పాల్గొన్నారు.

ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని రాస్తారోకో



చిల్లేపల్లి టోల్ గేటు వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లి టోల్‌గేటు వద్ద 20కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, టోల్ గేటు యాజమానుల దోపిడీని అరికట్టాలని ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయనాయుడు మాట్లాడారు. టోల్ గేటు యాజమాన్యం స్థానికులకు కూడా రూ.110 వరకు టోల్ ఫీజు వసూలు చేస్తున్నారని, అందుకు కలెక్టర్‌తో పాటు స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని స్థానికులకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, మధర్, కొమ్రరాజు వెంకట్, రాంరెడ్డి, భగత్, రంజిత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, సైదులు, పావని తదితరులున్నారు.

నక్సల్స్, ఆదివాసీలను హతమార్చడం సరికాదు

గరిడేపల్లి : అటవీ సంపదను అంబానీ, ఆదానీ వంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టాలనే దురుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అడవుల్లో ఉన్న నక్సలైట్లను, ఆదివాసీలను హతమార్చడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం కోర్టుల ద్వారా వారిని శిక్షించాలి తప్పా ఈ విధంగా నరమేధం సృష్టించడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ దుశ్చర్యను నిలిపి నక్సల్స్‌తో చర్చలు జరిపి అడవుల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పి ఆదివాసీల జీవనానికి భద్రత కల్పించాలని ఆయన కోరారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దెల జ్యోతి

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నేడు (సోమవారం) నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి అన్నారు. ఆదివారం పట్టణంలోని అమర వీరుల స్మారక భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైందని, అది కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్ అని అన్నారు. ఈ బడ్జెట్ కోటీశ్వరులు, శతకోటీశ్వర్లుగా చేసేందుకు ఉపయోగపడుతుందని ఆమె విమర్శించారు. సోమవారం జరిగే మహాధర్నాలో వేలాది మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి, నాయకులు ఎం.సైదమ్మ, దుర్గి బ్రహ్మం, ఇందిరాల త్రివేణి, శీలం వెంకన్న, పంగా వెంకటి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బండారు నరసయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన రాపోలు సావిత్రమ్మ, లింగంపల్లి అచ్చాలు, కారింగుల నారాయణ, పిడమర్తి దాదా, రోశయ్య, బల్గూరి చిరంజీవి, బంగారు నరసయ్య ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. ఆదివారం మృతుల చిత్రపటాలకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నడిగూడెం : మండలంలోని రామాపురానికి చెందిన మాజీ ఎంపీపీ నేలమర్రి వెంకటమ్మ భర్త ప్రసాద్ (62) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే పద్మావతి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరపతమ్మ, నాయకులు గుండు శ్రీనివాస్, గోసుల రాజేష్, భిక్షపతి ఉన్నారు.

11నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన ఐక్యత యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ (ఇన్విటేషన్) టోర్నమెంట్‌తో పాటు షాట్‌పుట్ క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ నెల 11, 12తేదీల్లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.300ల ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10వేల నగదు, షీల్డు, ద్వితీయ బహుమతి రూ.8.016, షీల్డు, తృతీయ బహుమతి రూ.6,016, చతుర్థ, పంచమ బహుమతులు రూ.4.016, 3,016ల నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.100ల ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ.3,016, 2,016, 1,516ల నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 84990 18030, 91331 03937, 95429 90790ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఫొటోగ్రాఫర్లకు అసోసియేషన్ అండ

హుజూర్‌నగర్ : ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫొటో అండ్ వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చేపూరి లక్ష్మణ్ అన్నారు. పట్టణానికి చెందిన షేక్ మదర్ ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.60లక్షల చెక్కును ఆదివారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. సంఘంలో సభ్యుడైన ప్రతి ఫొటో, వీడియో గ్రాఫర్‌ను సంఘం ఆపదకాలంలో ఆదుకుంటుందన్నారు. ప్రతి ఫొటోగ్రాఫర్ సంఘంలో సభ్యత్వం తీసుకుని సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామిశెట్టి కృష్ణ, కప్పల హరికృష్ణ, గొట్టం రవి, పెల్లుట్ల వెంకట్, లక్ష్మణ్, శంకర్, శ్రీనివాసచారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పున్నంరాజు ఆశయ సాధనకు కృషిచేయాలి



మఠంపల్లి : పున్నంరాజు స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ రూరల్ : వ్యవసాయ కార్మికుల కోసం అహర్నిశలు శ్రమించిన కోలహలం పున్నంరాజు ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన పున్నంరాజు 37 వర్ధంతిలో ఆయన పాల్గొని పున్నంరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, మాదూరి నర్సింహాచారి, లక్ష్మీనర్సింహ, గోపరాజు, నారాయణరెడ్డి, శ్రీనివాస్, గోపాలరాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకు చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కోలాహలం పున్నంరాజు 37వ వర్ధంతిని ఆదివారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండునాయక్, పల్లె వెంకటరెడ్డి, వట్టెపు సైదులు, మాళోతు బాలునాయక్, మాజీ సర్పంచ్‌లు కోలాహలం విశాలాంధ్ర, పద్మ, క్రిష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, నాయకులు హరియానాయక్, ఎస్‌కె సైదా, నజీర్, నాగయ్య యాదవ్, కొత్తూరు వెంకన్న, ప్రకాష్, కాశయ్య, రామరాజు, రాము, శ్రీను, లచ్చయ్య పాల్గొన్నారు.

మైహోం సిమెంట్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న నాయకులు, మైహోం సిమెంట్స్ అధికారులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో స్థానిక మైహోం సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణానికి చెందిన సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం మహా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని పరిశ్రమ సీనియర్ జీఎం నాగేశ్వరరావు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రతి ఏటా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 850మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇండియన్ బ్యూరో మైన్స్ చేపట్టిన టీబీ హారేగా-దేశ్ జీతేగా కార్యక్రమంలో భాగంగా టీబీ (క్షయవ్యాధి)పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మాజీ సర్పంచ్ కృష్ణవేణినరేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొండేటి రాంరెడ్డి, లింగయ్యయాదవ్, కార్యదర్శి మద్దుల వెంకటేశ్వర్లు, సంకల్ప హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ సీతారామ్, డాక్టర్ అనిల్‌రెడ్డి, డాక్టర్ రాకేష్, డాక్టర్ భార్గవి, సంస్థ మెడికల్ ఆఫీసర్ సాయికిరణ్, పరిశ్రమ అధికారులు ఏజీఎం నరేష్, మైన్స్ ఏజీఎం శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్యహరిశ్చంద్ర నాటకం రిహార్సల్ ప్రారంభం



సత్యహరిశ్చంద్ర నాటకం రిహార్సల్ చేస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమవరంలో నిర్వహించే గంగాసమేత అమర లింగేశ్వరస్వామి జాతర సందర్భంగా స్థానిక నాట్యకళామండలి ఆధ్వర్యంలో ఈ నెల 15న రాత్రి ప్రదర్శించనున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక రిహార్సల్‌ను ఆదివారం తెలంగాణ, ఆంధ్రాకు చెందిన సీనియర్ కళాకారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్యకళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రామిరెడ్డి, షేక్ ఖాశిం మాట్లాడారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు పి.వినాయకరాజు నిర్దేశకత్వంలో ఈనాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు షేక్ సైదులు, ఉస్తేల లింగారెడ్డి, సాముల హనుమారెడ్డి, కర్నాటి నాగేందర్‌రెడ్డి, ఉప్పు కృష్ణారావు, ప్రకాష్‌బాబు, ధర్మయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, జోజి, కోటేష్, కొమరయ్య, సైదిరెడ్డి, బలరామయ్య, వీరమణి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజలు

కోదాడరూరల్ : పేదల ఆరోగ్యం కోసం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కాపుగల్లు గ్రామంలో ముత్తవరపు లక్ష్మమ్మ-సుబ్బారావుల జ్ఞాపకార్థంగా పాండురంగారావు మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, టీపీసీసీ సభ్యులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, సామినేని ప్రమీల, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హరేరామ నామ సంకీర్తన



హరేరామ నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మునగాల : మండల కేంద్రంలో గల శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో 65వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 72గంటల పాటు కొనసాగే హరేరామ నామ సంకీర్తన ఆదివారం ప్రారంభమైంది. ఈ సంకీర్తనను గ్రామానికి చెందిన ఈదారావు ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం వేకువజామున హనుమాన్ భక్తసమాజం, మహిళా భక్త సమాజం ఆధ్వర్యంలో పురవీధుల్లో నగరసంకీర్తన నిర్వహించారు. అనంతరం హనుమాన్ పథాకాన్ని గ్రామానికి చెందన దేవరం రామిరెడ్డి ఆవిష్కరించారు. సంకీర్తనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తూముల వీరస్వామి, గంధం అంజయ్య కోరారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు బొర్రా కృష్ణమాచార్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోదాడరూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04విద్యా సంవత్సరంలో పదోతరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అమృతారెడ్డి, ఎంఈఓ చత్రునాయక్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, ఆంజనేయశర్మ, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, వీరారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 20ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినిఒకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు మహమ్మద్ ఎక్బాల్, బొడ్డు వీరయ్య, చందా శ్రీనివాసరావు, సట్టు నాగేశ్వరరావు, వరప్రసాదరావు, కరుణలత, రామ్మూర్తి, ఉమా, రామారావు, రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం కోదాడ పట్టణంలోని ఈవీఆర్ డిగ్రీ కళాశాలలో 1999నుంచి 2002వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొడ్డు శ్రీనివాసరావు, పోకల వీరబాబు, మల్లు సురేందర్‌రెడ్డి, సీహెచ్.కిశోర్, కుమ్మరి శేషగిరి, పసుపులేటి నాంచారయ్య, నరసింహచారి, నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, నిర్వాహకురాలు వాచేపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనం బోరునీరు అక్రమంగా వినియోగం

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం పల్లెప్రకృతి వనం బోరు నుంచి పక్కనే ఉన్న ఓ రైతు తన వ్యవసాయ భూమికి రెండు నెలలుగా అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. ఇదే బోరు నుంచి గ్రామంలోని 1,2,3,4 వార్డులకు తాగునీటిని కూడా సరఫరా చేస్తున్నారు. కానీ ఆ బోరు నీటిని అక్రమంగా పంట పొలానికి వాడుతుండడంతో అవే వార్డులకు రెండు నెలలుగా తాగునీరు సరిగ్గా సరఫరా కావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని, తాగునీటిని గ్రామప్రజలకు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.